RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:76 22-10-2025 బుధవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /

## అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న భారత్: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (టుడే విదుర): భారతదేశం.. ఆపరేషన్ సిందూర్ ద్వారా ధర్మాన్ని పాటించడమే కాకుండా ప్రతీకారం సైతం తీర్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. ఆయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత జరుగుతున్న రెండో దీపావళి వేడుకలు ఇవి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు మనకు బోధించారని.. అలాగే అన్యాయాన్ని ఎదరించడానికి ధైర్యాన్ని సైతం ఇచ్చారని చెప్పారు. అందుకు ఈ ఏడాది మేలో జరిగిన ఆపరేషన్ సిందూరు ద్వారా ఇది నిరూపితమైందని ప్రధాని మోదీ వివరించారు.అదీకాక ఈ దీపావళి వేళ దేశంలోని మారుమూల జిల్లాల్లో సైతం దీపాలు వెలిగించి పండగ చేసుకున్నారని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం, మావోయిస్టులను దాదాపుగా నిర్మూలించామని.. అందువల్లే ఇది సాధ్యమైందని వివరించారు. చాలా మంది మాజీ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి.. రాజ్యాంగంపై నమ్మకంతో అభివృద్ధికి దోహదపడు తున్నారని చెప్పారు.

## కోనసీమ పేలుడు ఘటన.. మృతుల కుటుంబాలకు 15 లక్షల పరిహారం



అమరావతి,అక్టోబర్ 21(టుడే విదుర) : అంబేద్కర్ కోనసీమ జిల్లా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయిన హెూం మంత్రి అనిత, అధికారులు సురేష్, ఆకే రవికృష్ణ బాణసంచా పేలుడు ఘటనకు సంబంధించిన నివేదికను సీఎంకు అందించారు.ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు మెటిరీయల్ మాన్యుఫాక్చరింగ్ చేశారని, హార్డ్ మెటీరియల్ వాడటం వల్లే స్పార్క్ వచ్చి, మాన్యుఫాక్చరింగ్ జరుగుతున్న ప్రాంతంపై పడిందని నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఏ మాత్రం నిబంధనలు పాటించలేదని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

## పట్టణాల్లో మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం కీలక నిర్ణయం



అమరావతి, అక్టోబర్ 21 (టుడే విదుర):రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పట్టణాలలో తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అమృత్ 2.0 పథకం కింద 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏపీయూఎఫ్ఐడీసీ , పబ్లిక్ హెల్త్, గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్లకు ఈ పనుల నిర్మాణంతోపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జారీ చేసి ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే మొత్తం ప్రాజెక్టు ఖర్చులో కేంద్రం రూ. 2, 470 కోట్లు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2, 490 కోట్లు విడుదల చేయనున్నాయి. ఇక ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 925 కోట్లు విడుదల చేయనుంది. పట్టణాల వాటా రూ. 590 కోట్లుగా నిర్ధారించింది. అంతా కలిపి ప్రాజెక్టు క్యాపెక్స్ రూ.6, 477 కోట్లుగా.. దీనికి 10 ఏళ్ల నిర్వహణ ఖర్చు రూ.1, 499 కోట్లుగా నిర్ణయించింది.

## భీమవరం డీఎస్పీపై పవన్ కల్యాణ్ సీరియస్.. నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఆదేశం

**భీమవరం డీఎస్పీ జయసూర్యపై పవన్‌కు ఫిర్యాదులు**

**పేకాట శిబిరాలు, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు**

**పశ్చిమ గోదావరి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన పవన్ కల్యాణ్**



భీమవరం, అక్టోబర్ 21 (టుడే విదుర): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారశైలిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. డీఎస్పీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా ఎస్పీని ఆయన ఆదేశించారు.భీమవరం డీఎస్పీ పరిధిలో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని, ఆయన నేరుగా సివిల్ వివాదాల్లో తలదూరుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి పలు ఫిర్యాదులు అందాయి. కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి నేతల పేర్లను వాడుకుంటున్నారన్న ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పవన్ కల్యాణ్ నేరుగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు.తన దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ, డీఎస్పీ జయసూర్య పనితీరుపై నివేదిక పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు సివిల్ వివాదాల జోలికి వెళ్లకుండా చూడాలని, ఇలాంటి చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా చూస్తూ శాంతిభద్రతలను కాపాడాలని దిశానిర్దేశం చేశారు.

## ఆస్ట్రేలియా పర్యటనలో నారా లోకేశ్ చొరవ... ఏపీ ఆక్వా రైతులకు భారీ ఊరట

### భారత రొయ్యల దిగుమతికి ఆమోదం తెలిపిన ఆస్ట్రేలియా



**ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ వెల్లడి**

**వైట్ స్పాట్ వైరస్ కారణంగా ఉన్న అడ్డంకులు ఇక దూరం**

**అమెరికా సుంకాలతో నష్టపోయిన ఆక్వా రంగానికి గొప్ప ఊరట**

**కొత్త మార్కెట్ల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలం**

**సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియాతో భాగస్వామ్యంపై లోకేశ్ చర్చలు ఫలప్రదం**

అక్టోబర్ 21 (టుడే విదుర): అమెరికా విధించిన భారీ సుంకాలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు భారీ ఊరట లభించింది. భారత రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. చాలాకాలంగా వైట్ స్పాట్ వైరస్ కారణంగా మన రొయ్యలపై ఉన్న అడ్డంకులు ఈ నిర్ణయంతో తొలగిపోయాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో, ఉన్న ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శుభవార్తను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ఈ పరిణామంపై లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "భారత రొయ్యల దిగుమతికి తొలిసారిగా ఆమోదం లభించింది. ఇందుకు విశేషంగా కృషి చేసిన భారత, ఆస్ట్రేలియా ప్రభుత్వాలకు మా ప్రగాఢ కృతజ్ఞతలు" అని ఆయన తెలిపారు. కేవలం ఒకే మార్కెట్‌పై ఆధారపడకుం డా, నూతన మార్కెట్లను అన్వేషించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవాలని ఆయన అబిప్రాయపడ్డారు.తన పర్యటనలో భాగంగా, సముద్ర ఉత్పత్తుల వాణిజ్యంపై ఆస్ట్రేలియాతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు లోకేశ్ చర్చలు జరుపుతున్నారు. సీఫుడ్ ఇండస్ట్రీ ఆస్ట్రేలియా సీఈఓ వెరోనికా పాపకోస్టా, ఎంగేజ్‌మెంట్ మేనేజర్ జాస్మిన్ కెల్వేర్‌లతో ఆయన సమావేశమయ్యారు. సుస్థిర ఆక్వాకల్చర్, వాణిజ్య అవకాశాలపై వారితో చర్చించారు. "భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 60 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఈ ఎగుమతుల విలువ 7.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 66,000 కోట్లు)" అని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## వైసీపీ నేత భూమనకు పోలీసుల నోటీసులు



తిరుపతి,అక్టోబర్ 21(టుడే విదుర): వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి తిరుపతి ఎస్వీ వర్సిటీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శ్రీ వెంకటేశ్వర గో సంరక్షణశాలలో గోవుల మృతిపై భూమన చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ విషయంలోనే ఈ నెల 23న ఉదయం 11 గంటలకు విచారణ హాజరుకావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు.శ్రీ వెంకటేశ్వర గోశాలలోని అధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే పదుల సంఖ్యలో గోవులు అకాల మరణం చెందాయంటూ ఇటీవల భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు చేశారు. వాటికి సరైన సంరక్షణ, వైద్యం అందించడంలో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. అయితే, భూమన చేసిన ఈ ఆరోపణలు రాజకీయంగా సంచలనం సృష్టించాయి. మరోవైపు ఆయన చేసిన ఆరోపణలను పలువురు ఖండించారు. ఈ నేపథ్యంలోనే కొందరు భూమనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని, సాక్ష్యాలు చూపాలంటూ భూమనకు నోటీసులు జారీ చేశారు. మరి పోలీసుల విచారణకు భూమన హాజరవుతారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.

## ప్రొద్దుటూరును క్యాసినో అడ్డాగా మార్చారు: రాచమల్లు సంచలన ఆరోపణలు

కడప అక్టోబర్ 21 (టుడే విదుర): కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని, అధికార టీడీపీ నాయకులే ఈ వ్యవహారాలను నడిపిస్తున్నారని వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టణంలో క్యాసినో, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి జూద క్రీడలు విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ అక్రమ కార్యకలాపాలను టీడీపీకి చెందిన కీలక నాయకులే స్వయంగా నిర్వహిస్తున్నారని రాచమల్లు ఆరోపించారు.

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య ఎన్నిక

ఒంగోలు, అక్టోబర్ 21 (టుడే విదుర): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గా జి.ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామ కృష్ణ స్థానంలో ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా, ఒంగోలులో జరిగిన మహాసభలో కార్యదర్శి ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం విజయవాడలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈశ్వరయ్యను కార్య దర్శిగా ఎన్నుకున్నారు. ఈ కౌన్సిల్ సమావేశానికి జాతీయ కార్యదర్శి రాజా హాజరయ్యారు.

# సంపాదకీయం

## సాహిత్య సంస్కృతిని బలపరిచేందుకు ఛాయ లిటరేచర్ ఫెస్టివల్

వేర్వేరు పాయల గుండా పయనిస్తున్న తెలుగు సాహితీ సమాజాన్ని ఒక గొడుగు కిందకు చేర్చే ప్రయత్నంగా, తెలుగులో మొట్టమొదటి లిటరేచర్ ఫెస్టివల్‌ను 'ఛాయ' సంస్థ నిర్వహించ తలపెట్టింది. రచయితలు, పాఠకులు, అనువాదకులు, విమర్శకులు, ప్రచురణకర్తల మధ్య అర్థవంతమైన సంభాషణల కోసం జరుగుతున్న ఈ సాహిత్యోత్సవం అక్టోబర్ 25న హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరుగుతుంది. ఈ సందర్భంగా ఈ లిటరేచర్ ఫెస్టివల్‌కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న కె. శ్రీనివాస్ తో జరిపిన సంభాషణ ఇది.

ఛాయ సాహిత్యోత్సవం ముఖ్య ఉద్దేశం ఏమిటి? ఎలాంటి ఫలితాలను ఆశిస్తున్నారు?తెలుగు సాహిత్యరంగం అనేక పాయలలో, తలాలలో విస్తరించి ఉంది కానీ, తరచుగా వాటి మధ్య సంభాషణ జరగడం లేదు. జనరేషన్ల మధ్య కూడా చాలా ఎడం ఏర్పడింది. దక్షిణాది భాషా సాహిత్య సమాజాలతో పరిచయం కానీ, ఆదాన ప్రదానాలు కానీ అతితక్కువ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర భాషా సాహిత్యాలతో కూడా పరాయితనం కనిపిస్తోంది. ఈ దూరాలను తగ్గించే ప్రయత్నమే ఈ సాహిత్యోత్సవం ముఖ్యోద్దేశం.రచయితల మధ్యనే కాదు, ప్రచురణకర్తల మధ్య సమన్వయం ఏర్పడాలి. పుస్తకాల ప్రచురణ, అమ్మకాలు, పంపిణీ వంటి ఉమ్మడి అంశాలకు ఒక సమష్టి కార్యాచరణ అవసరం. ప్రభుత్వం నుంచి సానుకూల విధాన నిర్ణయాలను, ప్రోత్సాహకాలను రాబట్టవలసి ఉంది. సాహిత్యాభిమానులైన వ్యక్తిగత, సంస్థాగత దాతలను భాగస్వాములను చేయవలసి ఉంది. ఈ మధ్య బెంగళూరులో జరిగిన బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవంలో దక్షిణ భారత ప్రచురణకర్తల ఫోరమ్ ఏర్పాటు మీద ప్రతిపాదనలు వచ్చాయి.తమిళ, కన్నడ, మలయాళ సమాజాల్లో సాహిత్యం, పఠనం సాంస్కృతిక విశేషాలుగా, ప్రజా అభిరుచులుగా బలంగా నాటుకుని ఉన్నాయి. తెలుగు సమాజాల్లో ఆ విలువ లోపించింది. బలమైన కళా సాంస్కృతిక వాతావరణం లేకపోవడం, సమాజం బౌద్ధిక స్థాయిని, చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఆ లోటును కొంతైనా భర్తీ చేయగలిగే ప్రభావం వేయాలని ఈ ఫెస్టివల్ ఆశిస్తున్నది.కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ జరుగుతోంది. కానీ, అందులో ప్రాంతీయ, స్థానిక సాహిత్యానికి అతితక్కువ ప్రాతినిధ్యమే దక్కుతోంది. ఆంగ్ల, శిష్ట పాఠకసమాజాన్ని దృష్టిలో పెట్టుకుని దాని రూపకల్పన జరుగుతోందనే అభిప్రాయం ఉంది. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆమధ్య ఒక సాహిత్యోత్సవం జరిగింది. ఒక మంచి, ప్రశంసనీయమైన ప్రయత్నం. అయితే, ప్రధానంగా అది సెమినార్ నమూనాలో జరిగింది. సాహిత్యశ్రేణుల మధ్య సంభాషణకు పరిమితమైన ఆస్కారమే ఉండింది.ఉత్సవ వాతావరణంలో సాహిత్య సమావేశాల నిర్వహణ ఒకనాడు తెలుగు ప్రాంతాలలో జరిగేది. 1953లో అలంపూర్‌లో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్ ఏడో వార్షికోత్సవాలు, అన్ని తెలుగు ప్రాంతాల రచయితల ప్రాతినిధ్యంతో ఘనంగా జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆ సభలకు అతిథిగా రావడం ఒక విశేషమైతే, హైదరాబాద్ నుంచి ఒక ప్రత్యేక రైలు ఆ సమావేశాల కోసం నడిపారు. సాహిత్య అకాడమీ, యువభారతి వంటి సంస్థల వార్షిక కార్యక్రమాలు ఎంతో సందడిగా జరిగేవి. ఆ ఉత్సవాలకు కొన్ని పరిమితులు, పట్టింపులు ఉండి ఉండవచ్చును కానీ, సాహిత్యాభిమాను లందరూ వాటికి హాజరయ్యేవారు. ఆ కాలంలో పాలక రాజకీయాలలో ఉండేవారికి సైతం సాహిత్యాసక్తులు ఉండేవి. ప్రాబల్య వర్గాలలో ఇప్పుడు ఆ స్పర్శ కూడా కనిపించడం లేదు. ఈ పరిస్థితి ప్రభుత్వ సాంస్కృతిక, సాహిత్య విధానాల మీద ప్రతికూల ప్రభావాలు వేస్తోంది. సృజనాత్మకత, భావుకత, పుస్తకపఠనం వంటివి ప్రధానాంశాలే కావన్న ధోరణి ప్రబలిపోయింది. ఇతర దక్షిణ రాష్ట్రాలలో ఉన్న వాతావరణం మన దగ్గర లేదంటే, అందుకు ఈ చారిత్రక, సామాజికార్థిక కారణాలన్నీ ఉన్నాయి.తెలుగు, దక్కనీ సాహిత్యాలు ప్రధానంగా, తక్కిన దక్షిణాది భాషసాహిత్యరంగాలను కూడా కలుపుకుంటూ ఛాయా లిటరేచర్ ఫెస్టివల్ (సిఎల్‌ఎఫ్) జరుగుతున్నది. సాహిత్యాన్ని సమీక్షించుకోవడం, పరిచయం చేసుకోవడం మాత్రమే కాక, సాహిత్య, అనుబంధ రంగాల బృందాల మధ్య కలివిడికి, సంప్రదింపులకు ఈ ఉత్సవం ఆస్కారం కల్పిస్తుంది. ప్రముఖ రచయితలతో నేరుగా ముఖాముఖీకి వేదిక కల్పిస్తోంది. వివిధ భాషాసాహిత్యాల ప్రచురణకర్తల మధ్య సంభాషణ పెరిగి, తెలుగు సాహిత్యం పొరుగుభాషలలోకి వెళ్లే ఆస్కారం కలుగుతుంది. బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవం నుంచి ప్రేరణ పొంది, చిన్నస్థాయి ఆరంభ ప్రయత్నంగా, ఇది ప్రారంభమవుతున్నది. స్పందనను బట్టి మున్ముందు మరింత పెద్దస్థాయిలో ఉత్సవాలను ఆశించవచ్చు.

## కుళ్లిన, నిల్వ చికెన్ విక్రయాలు..

# రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు

విజయవాడ సిటీ, అక్టోబరు21 (టుడే విదుర): నగరంలోని ప్రజలకు కుళ్లిన, నిల్వ ఉన్న మాంసాన్ని విక్రయిస్తున్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఎన్నో ఏళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ మోసాన్ని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్ర చండు ప్రకాష్ నాయుడు పసిగట్టారు. తన సిబ్బంది, మున్సిపల్, పశు సంవర్ధక శాఖ ఆధికారులతో తనిఖీలు చేసి చికెన్ షాపుల్లో జరుగుతున్న చీటింగ్ బయటపెట్టారు. మొగల్రాజపురం, పటమటలంక ప్రాంతాల్లోని రెండు దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన ఈ బృందం ఒళ్లు గగుర్పొడిచే అంశాలను మన ముందుకు తీసుకొచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారి రవీంద్రరెడ్డి, మున్సిపల్ వెటర్నరీ డాక్టర్ సోమశేఖరరెడ్డి, మాంసాభివృద్ధి కార్పోరేషన్ అసిస్టెంట్ డైరక్టర్లు డాక్టర్ సుధామాధురి, డాక్టర్ ఎ. వీరప్రసాద్, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.ఆ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువ మంది





సదరు షాపులోనే చికెన్ కొను గోలు చేస్తుంటారు. పెద్ద సంఖ్యలో ప్రజలకు చికెన్ అమ్మే ఈ షాపు లోపలకు వెళ్లిన ఈ బృందం ఒక్కసారిగా కంగుతింది. మాంసం. ప్రాసెస్ చేసే ప్రాంతాలు దుర్భరంగా ఉన్నాయి. వారం రోజుల క్రితం మాంసం ఫ్రీజ్లో ఉంది. 24 గంటల క్రితం చనిపోయిన కోళ్లు ర్యాక్ లోనే ఉన్నాయి. నాలుగు రోజులుగా కోళ్ల వ్యర్థాలను అక్కడ నుంచి బయలకు తీసుకెళ్లలేదు. పైకి అత్యంత ఆకర్షణీయంగా కనిపించే ఈ షాపు లోపల ఉన్న వాతావరణం చూసి ఈ బృందం ఒక్కసారిగా బిత్తరపోయింది. వెంటనే దుకాణంపై కేసు నమోదు చేసింది. నిల్వ ఉన్న మాంసంపై బ్లీచింగ్ చల్లి అక్కడ నుంచి తరలించింది.తరువాత.. పటమటలంక కృష్ణవేణి రోడ్డులోని ఓ దుకాణంలోనూ నిల్వ ఉన్న మాం సాన్ని ఈ బృందం గుర్తించింది. అక్కడైతే ఏకంగా టాయిలెట్ పక్కనే మాంసాన్ని నిల్వ చేశారు. కొనుగోలుదారులు రాగానే అదే మాంసాన్ని అంటగడుతున్నట్లు ఈ బృందం గుర్తించింది. కోళ్ల వ్యర్థాలు, అపరిశుభ్రంగా ఉన్న ఈ దుకాణంపైనా వారు కేసు నమోదు చేశారు. ఈ షాపు నుంచి అత్యధికంగా హోటళ్లకు చికెన్ సరఫరా అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఈ సంస్థను నెలకొల్పారన్నారు. నాసిరకు మాంసాన్ని విక్రయించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

## విశాఖ ఆర్డీవో, డీఆర్వో వివాదం..

# సర్కార్ కీలక నిర్ణయం




విశాఖపట్నం, అక్టోబరు21 (టుడే విదుర): ఆర్డీవో శ్రీలేఖ, డీఆర్వో భవానీ శంకర్‌ల మధ్య వివాదంపై ప్రభుత్వం స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్డీవో, డీఆర్వోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్డీవో, డీఆర్వో మధ్య విభేదాలతో వ్యవహారం రోడ్డెక్కగా.. గవర్నమెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. జాయింట్ కలెక్టర్‌కు డీఆర్వో బాధ్యతలు, డిప్యూటీ కలెక్టర్ హెచ్‌పీసీఎల్‌కు ఆర్డీవో బాధ్యతలను అప్పగించింది ప్రభుత్వం. వారిద్దరినీ విధుల నుంచి రిలీవ్ చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆర్డీవో, డీఆర్వోలకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు ప్రభుత్వం.కాగా... డీఆర్వో ప్రతి నెలా నిత్యావసర సరుకుల కోసం తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి ఇండెంట్ పెడుతున్నారని ఇటీవల కలెక్టర్‌కు ఆర్డీవో శ్రీలేఖ ఫిర్యాదు చేశారు. ఈ విషయం కాస్తా లీక్ అవడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై అమరావతి నుంచి రెవెన్యూ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. గతఏడాదే ఇరువురు అధికారులు జిల్లాకు బదిలీపై వచ్చారు. మొదట్లో మంచిగానే ఉన్నప్పటికీ రానురాను ఇరువురి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది.ప్రోటోకాల్ విధులు ఆర్డీవో చూడాల్సి వస్తుందని.. కానీ ప్రోటోకాల్ విధుల విషయంలో తనకు చివరి నిమిషంలో సమాచారం ఇస్తున్నారని శ్రీలేఖ వాపోతున్నట్లు సమాచారం. కానీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల పేషీలకు ఆమె చాలాకాలం నుంచి దూరంగా ఉంటున్నారని సిబ్బంది చెబుతున్న పరిస్థితి. ఇదిలా ఉండగా.. తాజాగా తహశీల్దార్ కార్యాలయాల నుంచి డీఆర్వో ఇంటి సామగ్రి తెప్పించుకున్నట్లు ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదు వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఇద్దరు అధికారులపై ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

## టారిఫ్ లపై రాష్ట్ర వ్యాప్తంగా

# ట్రంప్ దిష్టిబొమ్మల దగ్ధం



యంత్రాంగం:అఅక్టోబరు21 (టుడే విదుర): అమెరికా సామ్రాజ్యవాద ట్రంప్ వ్యవసాయ ఉత్పత్తులపై పెంచిన సుంకాలకు నిరసనగా దీపావళి రోజున ట్రంపాసురవధ దిష్టిబొమ్మలను రాష్ట్రవ్యాప్తంగా తగలబెట్టి నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుతో అనేక జిల్లాల్లో ట్రంప్ ఫ్లెక్సీని తగలబెట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగం, పాడి, ఎగుమతి చేసే ఉత్పత్తులపై 11 నుంచి 50% ట్రంప్ విధించిన సుంకాల వల్ల వ్యవసాయ రంగం దివాళ తీసి వ్యవసాయ కార్మికులకు పని దినాలు కోల్పోయి పెద్ద ఎత్తున వలసలు పోవలసి వస్తుందన్నారు. భారతదేశ వ్యవసాయ రంగాన్ని దివాళి తీసే విధానాలు అవలంబిస్తున్న అమెరికా సామ్రాజ్యవాద దేశాన్ని బిజెపి ప్రభుత్వం కనీసం ప్రశ్నించకపోవడం 150 కోట్ల భారత దేశ ప్రజలను అవమానించడమేన్నారు. బలవంతపు భూసేకరణలో 2013 చట్టాన్ని అమలుకై ఉద్యమం తప్పదని, అభివృద్ధి అనే ముద్దు పేరు చెప్పి రాష్ట్రంలో 32 కేంద్రాలలో సుమారు మూడు లక్షల ఎకరాలు ప్రభుత్వం రెండు, మూడు పంటలు పండే భూములను అదానీ, అంబానీ కార్పొరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు. భూములు సేకరించే ప్రాంతంలో 2013 చట్టం అమలు చేయడం లేదని, వేలాది ఎకరాలు కార్పొరేట్ల కట్ట పెడుతుంటే ఆ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కార్మికులకు పనులు కోల్పోయి ఉపాధి దెబ్బతిని పెద్ద ఎత్తున వలసలు బోతున్నారు. కౌలుదారులు వీధి పాలవుతున్నారు. కాబట్టి బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 చట్టాన్ని అమలు చేసి,భూ సేకరణ చేసిన ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# టీటీడీ ట్రస్ట్ లకు భారీగా విరాళాలు




తిరుమల :అక్టోబరు21 (టుడే విదుర): టీటీడీ ట్రస్ట్ లకు భారీగా విరాళాలు అందాయి. గడిచిన 11 నెలల్లో (2024 నవంబర్ 1 నుండి 2025 అక్టోబర్ 16వ తేదీ వరకు) రికార్డు స్థాయిలో రూ 918.6 కోట్లు విరాళాలు అందాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడాక టీటీడీకు క్రమంగా దాతలు పెరుగుతున్నారని టిటిడి వర్గాలు తెలిపాయి. టీటీడీ చైర్మన్ గా బీఆర్ నాయుడు భాధ్యతలు చేపట్టాక టీటీడీ ట్రస్ట్ లకు వెల్లువలా విరాళాలు చేరుతున్నాయని పేర్కొన్నారు. అత్యధికంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ 338.8 కోట్లు విరాళం అందిందని తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ కు రూ 252.83 కోట్లు, శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్ కు రూ 97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ 66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ 56.77 కోట్లు, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ 33.47 కోట్లు, బర్డ్ ట్రస్ట్ కు రూ 30.02 కోట్లు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ కు రూ 20.46 కోట్లు, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్ కు రూ 13.87 కోట్లు, ఎస్వీబిసీ కు రూ 6.29 కోట్లు, స్విమ్స్ కు రూ 1.52 కోట్లు అందాయని తెలిపారు. ఆఫ్ లైన్ కంటే ఆన్ లైన్ ద్వారానే దాతాలు ఎక్కువ సంఖ్యలో విరాళాలు సమర్పిస్తున్నారని వెల్లడించారు. ఆన్ లైన్ ద్వారా రూ 579.38 కోట్లు, ఆఫ్ లైన్ ద్వారా 339.20 కోట్లు విరాళాలు అందాయని వెల్లడించారు. దాతలకు తగిన గౌరవం, సదుపాయాలు కల్పించడంలో ఎక్కడా లోపం తలెత్తకూడదని చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ట్రస్ట్ లకు విరాళాలతో పాటు పలు నిర్మాణాలు, యంత్రాలు కొనుగోలు, సాంకేతిక అభివృద్ధికి దాతాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు.

# మనువాదంపై మహిళలు ఐక్యంగా పోరాడాలి

అక్టోబరు21 (టుడే విదుర):నేడు పాలకులు అవలంభిస్తున్న విధానాలు, మహిళా ఉద్యమం దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన హక్కులను నాశనం చేసే విధంగా మారుతున్నాయి. మనువాద సిద్ధాంతాలతో ఆమెను అణగదొక్కే ప్రయత్నం జరుగుతోంది. వాటికి వ్యతిరేకంగా గళం విప్పాలని, ఐక్యంగా పోరాడాలని ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి టీచర్ పిలుపునిచ్చారు. అనంతపురంలో ఇటీవల నిర్వహించిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలకు వచ్చిన ఆమె 'ప్రజాశక్తి'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.మైనారిటీలపై దాడులు, మతోన్మాద దాడులు, మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

రాజ్యాంగానికి అనేక సవరణల ద్వారా బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుకూల మనువాద సిద్ధాంతాలను చొప్పించాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలు, మైనారిటీలు, గిరిజనులకు వ్యతిరేకంగా ఆ సవరణలు జరుగుతున్నాయి. గృహహింస, పనిప్రదేశాల్లో వేధింపులు, పనిగంటల పెంపు, వీటికి తోడు కుల, మత, రాజకీయపరమైన హింసలు మహిళలు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ వ్యతిరేకించాలి. మహిళల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత. లైంగిక వేధింపుల ఘటనల్లో 24 గంటలు లేదా రెండు రోజుల్లో నిందితులను అరెస్టు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. కేరళలో అదే విధంగా జరుగుతోంది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లిం, క్రిస్టియన్ మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. చత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నన్‌లను అరెస్టు చేసి రెండు నెలలపాటు జైలులో పెట్టడం, ఒడిస్సాలో హిందుత్వవాదులు క్రైస్తవ మతబోధకులపై దాడి చేసి దుర్భాషలాడటం వంటివి



ఇందుకు ఉదాహరణ. ఆ నన్‌లకు ధైర్యం చెప్పేందుకు మా ఐద్వా బృందం అక్కడికి వెళ్లింది.ఆడపిల్లలు చదువుకు దూరమౌతున్నారు. దీనిపై ఏమంటారు?

విద్యావ్యవస్థలో బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న నూతన సంస్కరణలు విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తున్నాయి.. పేదపిల్లల విద్యాభివృద్ధి పట్టని కేంద్రం అంతర్జాతీయ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. తద్వారా విద్య ఖరీదుతో కూడుకుని చాలామందికి చదువు దూరమౌతోంది. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో ఐదు తరగతులున్న బడుల్లో ఒకే ఒక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడు.

# జూపల్లిలో గజరాజుల దాడులు

## మామిడిచెట్టు కొమ్మలను పూర్తిగా విరిచేసిన ఏనుగులు




కల్లూరు, అక్టోబరు21 (టుడే విదుర): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోదబండ నుంచి శనివారం రాత్రి బయలుదేరిన 7 ఏనుగుల గుంపు అటవీ సరిహద్దులో ఉన్న పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శివయ్య, రఘు, జయపాల్, మునస్వామి, మోహన్, సుబ్బరత్నకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు పూర్తిగా విరిచేశాయి. కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తినేశాయి. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును గమనించిన గ్రామస్తులు టపాకాయలు పేల్చారు. టపాకాయలు శబ్దాలు వినడంతో ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాలకు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయని, దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.

# ఉపరితల ఆవర్తనం..
# ఏపీలోని ఈ జిల్లాల్లో భారీ వర్షాలు




ఇంటర్నెట్ డెస్క్, అక్టోబరు21 (టుడే విదుర): నైరుతి రుతుపవనాలు వెళ్లినప్పటికీ దేశంలోని పలు రాష్ట్రాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఈశాన్య రుతుపవనాల రాకతో పాటు ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వానలు కురుస్తున్నాయి. ఈ తరుణంలోనే ఇవాళ బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశము ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మిగిలిన జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతోపాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అధికారులు సూచిస్తున్నారు.

# భార్యను నరికి చంపిన భర్త



రాయదుర్గం:అక్టోబరు21 (టుడే విదుర):భార్యను భర్త నరికి చంపిన ఘటన అనంతపురం జిల్లా డి హిరేహాల్ మండలం మురడి గ్రామంలో తెల్లవారుజామున చోటు చేసుకుంది. హనుమంత రాయుడు తన భార్య నాగరత్నంను నరికి చంపాడు. వీరికి 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, డి. హీరేహాల్ ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులను విచారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యసనాలకు తాగుడుకు బానిస అయిన హనుమంతరాయుడు భార్యపై అనుమానం పెంచుకుని వేధించేవాడని పోలీసులు తెలిపారు.

# ఏపీ ఫుడ్ పాయిజన్ ఘటన..
# హెూటల్‌ను సీజ్ చేసిన అధికారులు




ఇంటర్నెట్ డెస్క్,అక్టోబరు21 (టుడే విదుర): ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరంలో ఫుడ్ పాయిజన్ 20 మందికి పైగా అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. అంబాజీపేట లోని పట్టాభి రామయ్య టిఫిన్ హెూటల్లో కలుషితమైన టిఫిన్ చేసిన 20 మందికి అస్వస్థత గురయ్యారు. దీంతో హెూటల్ ను తనిఖీ చేసిన అధికారులు..హెూటల్ ను మూసి వేశారు. కొన్ని రోజుల క్రితం పట్టాభిరామయ్య టిఫిన్ సెంటర్లో టిఫిన్ చేసిన వారికి వాంతులు విరోచనాలు అవ్వడంతో ఆస్పత్రిలో వారిని ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బాధితులు చికిత్స తీసుకుంటున్నారు.

# ఇద్దరు చిన్నారులను చంపి తల్లి ఆత్మహత్య



నల్గొండ :అక్టోబరు21 (టుడే విదుర): నల్గొండ జిల్లాలో కొండమల్లేపల్లిలో ఓ మహిళ ఇద్దరు చిన్నారులను చంపి ఆపై తానూ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మతులను బాపట్ల జిల్లా జనకవరం గ్రామానికి చెందిన కుంచాల నాగలక్ష్మి (27), అవంతిక (9), భవన్ సాయి (7)గా గుర్తించారు. కుటుంబ కలహాలతోనే తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి ఆపై బలవన్మరణానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యుత్ షాక్ తో గొర్రె మృతి



కలకడ (అన్నమయ్య) అక్టోబరు21 (టుడే విదుర): విద్యుత్తు షాక్ కు గురై గొర్రె మృతి చెందిన సంఘటన సంబేపల్లి మండలం పరిధిలో జరిగింది. సంబేపల్లి మండలం ఎస్ పంచాయితీ అగ్రహారం వద్ద, కలకడ మండలం కోట గుడిబండ పంచాయతీ గొల్లపల్లి కు చెందిన రైతు ఆంజనేయులుకు చెందిన గొర్రె విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. గ్రామానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ట్రాన్స్ఫార్మర్ కు ఏర్పాటు చేసిన న్యూటల్ వైరుకు గొర్రె మేతమేస్తూ అటువైపు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడే మఅతి చెందినట్లు బాధితుడు తెలిపారు. అయితే పొలాల మధ్య, నిత్యం ప్రయాణికులు ప్రయాణించే రోడ్డు ప్రక్కన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి దానికి భద్రత లేకుండా వదిలివేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఆపుతున్నారు. ఈ ట్రాన్స్ఫార్మర్ రోడ్డు ప్రక్కన ఉండడం వల్ల మరియు అటువైపు బహిర్భూమికి వెళ్లేవారు సైతం ప్రమాదాలకు గురికావడం జరుగుతుందని భయాందోళనలో ఉన్నట్లు గ్రామస్తులు తెలుపుకుంటున్నారు. విద్యుత్ శాఖ వారు ఇకనైనా స్పందించి ప్రమాదాలకు నిలయంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు కంచె ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించవలసిన అవసరం ఎంతైనా ఉందని అగ్రహారం గ్రామస్తులు వాపోతున్నారు.

# భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్యాయత్నం



కాకినాడ : అక్టోబరు21 (టుడే విదుర)::భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన వివాహితను పోలీసులు క్షణాల్లో కాపాడారు. స్థానిక జగన్నాధపురం సమీపంలోని ఎన్.టి.ఆర్. బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయస్సు గల మహిళ బ్రిడ్జిపై నుండి ఉప్పుటేరులోకి దూకేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాబురావు, పోలీస్ కానిస్టేబుల్ అప్పన్న సమయస్ఫూర్తితో స్పందించి ఆమెను పట్టుకొని కింద పడకుండా ఆపారు. వెంటనే ఆమెను సురక్షితంగా పైకి లాగి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆమెను విచారించగా తన భర్త నుండి తరచూ వేధింపులకు గురవుతున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో మానసికంగా విసిగి ఆత్మహత్య యత్నించినట్లు తెలిపింది. ఈ సంఘటనపై స్థానిక పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ట్రాఫిక్ సిబ్బంది చూపిన చాకచక్యానికి ప్రజలు, ప్రశంసలు కురిపిస్తున్నారు.

# అల్లూరు జిల్లా జడ్పిటిసి వారా నూకరాజు హత్య



కొయ్యూరు (అనకాపల్లి) :అక్టోబరు21 (హేలాపురి న్యూస్): కొయ్యూరు మండలం వైసిపి జడ్పిటిసి వారా నూకరాజు దారుణ హత్య గురయ్యారు. రోలుగుంట మండలం చటర్జీ పురం వద్ద ఆయనకు పది ఎకరాల పొలం ఉంది. భూమికి సంబంధించిన పట్టా ఆయన పేరు మీదే ఉంది. అయితే ఆ భూమిని గిరిజనులు సాగు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ భూ విషయం మీద గిరిజనులకు ఆయనకు గొడవలు జరుగుతున్నాయి. గతంలో ఆయన మీద గిరిజనులు దాడి చేశారు. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో దాదాపు నెల రోజులపాటు చికిత్స పొంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ గొడవల నేపథ్యంలో బైండోవర్ కేసులు కూడా పోలీసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయం జడ్పిటిసి నూకరాజు భూముల దగ్గరికి వెళ్లారు. గిరిజనులకు ఆయనకు మధ్య వాగ్వాదం నడిచింది. మాట మాట పెరిగి గిరిజనులు ఆయనను హత్య చేశారు. సమాచారం అందుకున్న రోలుగుంటం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు మొదలుపెట్టారు.

# సాధువులకు బట్టలు పంపిణి



మామిడికుదురు (కోనసీమ)అక్టోబరు21 (టుడే విదుర): అప్పనపల్లి బాల బాలాజీ సన్నిధిలోదీపావళి సందర్భంగా శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ . సూర్య భగవానునికి బూరెలు సమర్పించి అనంతరం వారి చేతుల మీద సాధు పుంగవులకు నూతన వస్త్ర సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డి వివి సత్యనారాయణ,నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, బాల బాలాజీ దేవస్థానం మాజీ చైర్మన్ మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, జాలెం శ్రీనివాస రాజా, ప్రజా ప్రతినిధులు భక్తులు గ్రామస్తులు సిబ్బంది పాల్గొని ఉన్నారు.

# తెనాలిలో యువకుడి కిడ్నాప్ కలకలం



తెనాలి :అక్టోబరు21 (టుడే విదుర): పట్టణంలో యువకుడు కిడ్నాప్‌నకు గురైన ఘటన కలకలం రేపింది. కుమార్తెను తన వద్దకు పంపించటం లేదన్న కారణంగా అల్లుడిని హతమార్చేందుకు స్వయంగా అత్త కిడ్నాప్‌నకు పాల్పడటం చర్చనీయాంశమైంది. కిడ్నాప్ కథను సుఖాంతం చేసిన నేపథ్యంలో స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రాత్రి నిర్వహించిన సమావేశంలో సిఐ సాంబశివరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి..తమిళనాడు ప్రాంతానికి చెందిన తిరుక్కో వల్లూరి యువరాజ్ మణికంఠ సూరి చారి అలియాస్ మణికంఠ కొంతకాలం నుంచి స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో ఉంటున్నాడు. 2021లో వినుకొండ ప్రాంతానికి చెందిన తిరువాయపాటి విజయలక్ష్మి కుమార్తె లిఖితను వివాహం చేసుకున్నాడు. లిఖిత తల్లి విజయలక్ష్మి ప్రవర్తనతో మణికంఠ విభేదించాడు. పెళ్లయిన నెల రోజులలోపే లిఖితను తెనాలికి తెచ్చి కాపురం పెట్టాడు. లిఖితను తీసుకు వెళ్లేందుకు అత్త విజయలక్ష్మి ఎన్నిసార్లు ప్రయత్నించినా మణికంఠ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో మణికంఠపై అత్త విజయలక్ష్మి ద్వేషం పెంచుకుంది. మణికంఠను హతమార్చయినా కుమార్తెను తీసుకువెళ్లాలని నిర్ణయించుకుంది. శనివారం అర్ధరాత్రి వినుకొండకు చెందిన మల్లెల వేణుగోపాల్, గుంటూరుకు చెందిన నక్క కిరణ్, తెనాలికి చెందిన బండారు యశ్వంత్ వర్ధన్, పిడుగురాళ్లకు చెందిన బత్తుల కోటేశ్వరరావుతో కలిసి విజయలక్ష్మి కారులో మణికంఠ ఇంటికి వచ్చి, అతనిపై దాడి చేయించి బలవంతంగా కారులో ఎక్కించుకుని పరారైంది. మణికంఠ ఇంటి చుట్టుపక్కల వారు గమనించి 112, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు కారు సహా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సకాలంలో స్పందించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

# కొండయ్య సత్రం బావిలో మృతదేహం లభ్యం



నూజివీడు టౌన్అక్టోబరు21 (టుడే విదుర):నూజివీడు పట్టణ పరిధిలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో గల దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన కొండయ్య సత్రం బావిలో ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతుడు పట్టణంలోని అజరయ్యపేటకు చెందిన తాళ్లూరి నాగరాజుగా గుర్తించారు. గత కొంతకాలంగా నాగరాజు కొండయ్య సత్రంలో అద్దెకు ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# కందిపప్పు ఏదీ?



ఇచ్ఛాపురం, అక్టోబరు21 (టుడే విదుర):జిల్లాలో రేషన్ డిపోల ద్వారా అందించే నిత్యావసరాల పంపిణీలో కేవలం రెండింటికే పరిమితమవుతున్నారు. బియ్యంతోపాటు పంచదార మాత్రమే అందిస్తున్నారు. గత తొమ్మిది నెలలుగా కందిపప్పు అందించడం లేదు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. జిల్లావ్యాప్తంగా 1603 రేషన్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,51,778 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా రేషన్‌కార్డుదారులకు బియ్యం, అరకేజీ పంచాదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ పంపిణీలో భాగంగా 12 రకాల వస్తువులు అందించేవారు. బియ్యం, పంచదార, కందిపప్పు కిరోసిన్, పామాయిల్, శెనగలు, వివిధ రకాల నిత్యావసరాలు అందించేవారు. కానీ తరువాత వచ్చిన ప్రభుత్వాలు రేషన్‌లో కోత విధిస్తూ వచ్చాయి. వైసీపీ హయాంలో అయితే కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొన్నాళ్లు కందిపప్పును అందించారు. కానీ, గత తొమ్మిది నెలలుగా రేషన్‌కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడం లేదు. దీంతో ప్రతినెలా రేషన్‌కార్డుదారులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.150వరకూ పలుకుతోంది. దీంతో అంత ధర ఇచ్చి కొనుగోలు చేయలేకపోతున్నామని సామాన్యులు వాపోతున్నారు. కనీసం కార్తీక మాసం దృష్ట్యా నవంబరు నెలలో అయినా రేషన్ డిపోల్లో కందిపప్పు అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్‌వో సూర్యప్రకాశరావు వద్ద ప్రస్తావించగా.. 'ప్రభుత్వం కందిపప్పు సరఫరాను నిలిపివేసింది. అందుకే అందించలేకపోతున్నాం. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లామ'ని తెలిపారు.

# వరిలో ఎలుకల బెడద

## - పొట్ట దశలో పంటను కొరికేస్తున్న వైనం
## - దిగుబడిపై రైతుల్లో ఆందోళన



నరసన్నపేట, అక్టోబరు21 (టుడే విదుర): వరి పంటలో ఎలుకల బెడద ఎక్కువైంది. పొట్ట దశలో పంటపై దాడి చేస్తున్నాయి. పొట్ట భాగాన్ని కొరికేసి తినేస్తున్నాయి. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 3.75 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, దమ్ములు, నాట్లు కోసం అధికంగా పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల నివారణకు మందులు కూడా స్ప్రే చేశారు. మరో నెల రోజుల్లో పంట చేతికందుతుందన్న సమయంలో ఎలుకలు విజృంభిస్తున్నాయి. దీంతో పంట రక్షణకు రైతులు పడరాని పాట్లుపడుతున్నారు. లక్ష ఎకరాల్లో ఎలుకల దాడి ప్రభావం ఎక్కువగా ఉంది. ఎకరానికి రెండు బస్తాల వరకు నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో దిగుబడులు ఎక్కువగా వస్తాయని రైతులు ఆశించారు. అయితే, నల్లదోమ, తెల్లదోమతోపాటు ఎలుకల బెడదతో జిల్లాలో సుమారు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

దిగుబడులు తగ్గుతాయి

వరిలో ఎలుకల బెడద ఏడాదికేడాది పెరుగుతుంది. నా ఎకరా వరి చేనులో 8సెంట్లను పూర్తిగా పాడు చేశాయి. పొట్ట దశలో పంటను కొరికేస్తున్నాయి. మరొక వైపు దోమతో ఈఏడాది వరి దిగుబడులు తగ్గుతాయి. పెట్టుబడులు ఎకరాకు అదనంగా రూ.3వేల వరకు పెరిగాయి.

# రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి : సిహెచ్.నర్సింగరావు



విశాఖ అక్టోబరు21 (టుడే విదుర): రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విశాఖలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నర్సింగరావు మాట్లాడుతూ లొ. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి సమస్యలన్నీంటినీ పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఊరించి చివరకు ఉసూరనిపించిందన్నారు. ఉద్యోగులకు దీపావళి బనాంజా అంటూ హడావుడి చేసింది.. కానీ కనీసం ఇవ్వాల్సిన డిఎ బకాయిలు, ఇతర బకాయిలు ఇవ్వకుండానే కేవలం ఒక డిఎ తోనే సరిపుచ్చడం సరైందికాదు అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 జూలై నాటికి ఇవ్వాల్సిన 4 డిఎ బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ కోరుతున్నదన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మిక, ఉద్యోగ వర్గాలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని, ఈ విధానాలను విడనాడాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నదన్నారు. ఉద్యోగులకు దాదాపుగా 32వేల కోట్ల రూపాయాలు బకాయిలున్నాయన్నారు. 4 విడతల సరెండర్ లీవుల బకాయిలున్నాయనీ వీటిలో పోలీసులకు చెందిన బకాయిలే దాదాపు 835 కోట్ల రూపాయలున్నాయని, వీటిని చెల్లించకుండా కేవలం పోలీసులకు మాత్రమే 105 కోట్ల రూపాయల మేరకే బకాయిలను 2 విడతలుగా చెల్లిస్తామని మొన్నటి చర్చల్లో తెలిపారు అని వివరించారు. మిగిలిన వాటిపై హామీలతో సరిపుచ్చారని ఆరోపించారు. ఒక విడత డిఎ ఇవ్వడం వలన నెలకు 165 కోట్ల రూపాయలు భారం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం సెలవిచ్చింది%ా% కానీ ఈ డిఎ గత సంవత్సరం జనవరి నుండి ఇవ్వాల్సి ఉందనీ%ా% అంటే దాదాపు 19 నెలల తర్వాత ఇప్పుడు చెల్లిస్తామని చెబుతూ దీనివల్ల భారం పడుతుందనడం సరైంది కాదు అని అన్నారు. ఇప్పటికైనా మిగిలిన 3 విడతల డిఎ బకాయిలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్సీ ఇస్తామని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామన్న హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నదన్నారు. అలాగే గత 12 సంవత్సరాల పైబడి కనీస వేతనాల జీవోలను సవరించలేదని దీనివలన కార్మికులు వేలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు.

# ఉపాధిలో దొంగ మస్టర్లకు చెక్

## ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అక్రమాల కట్టడి
## పని ప్రాంతానికి వస్తేనే మస్టర్ నమోదు



(అమరావతి–అక్టోబరు21 (టుడే విదుర)::ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లకు ఇక చెక్ పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యలతో పాటు ఎన్ఎంఎంఎస్ యాప్‌తో అక్రమాలను కట్టడి చేయనున్నారు. గతంలో మన రాష్ట్రం టీసీఎస్ ద్వారా అభివృద్ధి చేసిన ఎన్ఆర్‌జీఏ సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర ప్రభుత్వ ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత అందులోని లోపాలను ఆసరా చేసుకుని దొంగ మస్టర్లు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ దొంగ మస్టర్లను కట్టడి చేయడం అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా దొంగ మస్టర్ల నమోదుతో గ్రామాల్లో ఉపాధి పనుల వాతావరణం దెబ్బతింది. అప్పట్లో మండల కార్యాలయాల్లో కూర్చొని మస్టర్లు నమోదు చేయడం ద్వారా శ్రామికులు క్షేత్రస్థాయిలో పనికి రావడం మానేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శ్రామికులతో తిరిగి ఉపాధి పనులు చేయించడం కష్టంగా మారింది. దొంగ మస్టర్ల వ్యవహారం కొనసాగుతూనే వచ్చింది. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు దొంగ మస్టర్లను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. దీంతో పాటు కేంద్రం దొంగ మస్టర్ల కట్టడికి ఎన్ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీసు) యాప్‌ను అమల్లోకి తెచ్చింది. సిబ్బంది ఈ యాప్ ద్వారా పని ప్రదేశాల్లో శ్రామికుల ఫోటోలు తీస్తారు. ఫేస్ రికగ్నిషన్ ద్వారా కూలీలు ఆ రోజు పనికి హాజరైనట్లు గుర్తిస్తుంది. దీంతో శ్రామికుడికి ఆ రోజు వేతనం మంజూరవుతుంది. ఈ యాప్‌లో రోజుకు రెండుసార్లు ఫోటోలు తీస్తారు.

నకిలీ జాబ్‌కార్డుల కట్టడి

ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు నకిలీ జాబ్‌కార్డుల కారణంగానే ఎక్కువ దొంగ మస్టర్లు నమోదవుతున్నాయి. చట్టం ప్రకారం ఒక్కో కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తారు. గ్రామాల్లో కొన్ని చోట్ల ఆయా కుటుంబసభ్యుల్లో ఒకరినో, ఇద్దరినో వేరు చేసి సింగిల్ జాబ్‌కార్డులను క్రియేట్ చేస్తారు. తద్వారా ఆ కార్డులకు కూడా వంద రోజుల పని అవకాశం ఏర్పడుతుంది. దీంతో పనులు చేయకుండానే మస్టర్లు వేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విధంగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, రాజకీయపార్టీల కార్యకర్తలు అక్రమాలకు పాల్పడి ఉపాధి పథకం స్ఫూర్తిని దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నకిలీ జాబ్‌కార్డుల కట్టడికి శ్రీకారం చుట్టింది.


# కానిస్టేబుల్‌ను హత్య చేసిన రియాజ్ ఎన్‌కౌంటర్



నిజామాబాద్ :అక్టోబరు21 (టుడే విదుర):నిజామాబాద్‌లో కానిస్టేబుల్‌ను హతమార్చి పారిపోయిన వాహనాల దొంగ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రియాజ్ సోమవారం పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఓ ఏఆర్ కానిస్టేబుల్ నుంచి గన్ లాక్కునే తీవ్ర ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో పోలీసులు కాల్పులు జరపగా.. రియాజ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది.

గత రాత్రి రియాజ్(24) అనే దొంగను నిజామాబాద్ వినాయక్‌నగర్‌లోని సీసీఎస్ ఠాణాకు తరలిస్తున్న కానిస్టేబుల్ ప్రమోద్(48)ను కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. పోలీసులు అతని కోసం గాలించగా నగరంలోని సారంగాపూర్ శివారులో రియాజ్ ఉన్నట్లు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఓ పాడుబడ్డ లారీ క్యాబిన్‌లో దాక్కొని.. పోలీసులు రావడం చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికుడు సయ్యద్ ఆసిఫ్ అతన్ని పట్టుకోబోయాడు. ఇద్దరి మధ్య పెనుగులాట చోటు చేసుకోగా.. రియాజ్ తన వద్ద ఉన్న కత్తితో ఆసిఫ్ ఎడమచేతిని తీవ్రంగా గాయపరిచాడు. ఈలోపు పోలీసులు నిందితుడిని చుట్టుముట్టి తాళ్లతో బంధించింది. ఆసిఫ్‌ను నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నామని, పెనుగులాటలో నిందితుడు రియాజ్ సైతం తీవ్రంగా గాయపడటంతో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

# నవంబర్ 3 నుండి తెలంగాణలో ప్రైవేట్ కాలేజీలు బంద్..



హైదరాబాద్ :అక్టోబరు21 (టుడే విదుర): ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోతే నవంబర్ 3 నుండి తెలంగాణలో కాలేజీలు బంద్ చేస్తామని ప్రైవేటు కాలేజీల సమాఖ్య స్పష్టం చేసింది. ఇందులో భాగంగా అక్టోబర్ 22న ప్రభుత్వానికి నోటీసులు అందజేస్తామని పేర్కొంది. గతంలో ఫీజు బకాయిల సమస్యపై అక్టోబర్ 13 నుంచే బంద్‌కు వెళ్లాలని యాజమాన్యాలు భావించాయి. అయితే, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో జరిగిన సమావేశం అనంతరం ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నాయి. దీపావళి పండగలోపు రూ.300 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

# ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ప్రమాదం.. ఫైరింజన్ ఢీకొని ఒకరి మృతి..

అక్టోబరు21 (టుడే విదుర):హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయాలపాలయ్యారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వీఎస్టీ చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందిబండ్లగూడాకు చెందిన ఓ కుటుంబం యాక్టివా స్కూటీపై రాంనగర్ వైపు వెళ్తోంది. ప్రమాదవశాత్తు ఫైర్ ఇంజన్ వెనుక టైర్ కింద ఆ స్కూటీ పడింది. ఆ బైక్ మీద ఫాతిమా అనే మహిళ తన కొడుకు ఇబ్రహీం, కూతురు మోహిక్‌తో కలిసి వెళ్తోంది. ఈ ప్రమాదంలో మెహిక్ (16) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది %తల్లి ఫాతిమా, కొడుకు ఇబ్రహీం తీవ్ర గాయాలపాలయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు తల్లి కొడుకులను గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. వారి పరిస్థితి కూడా విషమంగానే ఉందని సమాచారం.




# పాతబస్తీ స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

ఇంటర్నెట్ డెస్క్, అక్టోబరు21 (టుడే విదుర): హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురా చౌరస్తా వద్ద గల ఓ స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చిన్నగా మొదలైన మాటలు ఒక్కసారిగా గోదాం అంతటా వ్యాపించాయి. గమనించిన సిబ్బంది అక్కడినుంచి దూరంగా వెళ్లిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బహదూర్‌పురా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజిన్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో గోదాంలోని స్క్రాప్ సామగ్రితో




పాటు ఒక జీపు, ఒక కారు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# భూసేకరణ ఎప్పుడో?.. పెండింగ్‌లో సింగోటం-గోపల్‌దిన్నె కెనాల్



## ఏడేండ్లుగా నలుగుతున్న ప్రతిపాదన
## సమీక్షలతోనే సరిపెడుతున్న ప్రభుత్వం
## 384ఎకరాల సేకరణలో తీవ్ర జాప్యం
## ఐదు మండలాల రైతులకు నిరాశ

వనపర్తి, అక్టోబరు21 (టుడే విదుర):సింగోటం రిజర్వాయర్ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు ప్రత్యేక కాల్వను ఏర్పాటు చేయాలన్న లక్ష్యం ముందుకు సాగడం లేదు. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా దాదాపు ఏడేండ్లుగా ఈ కెనాల్ ప్రతిపాదన ఆటకెక్కింది. ఈ కాల్వ ఏర్పాటు చేయనందున ప్రతిఏటా జూరాల ఎడమ కాల్వపై ఆధారపడ్డ చివరి మండలాల రైతుల పంటలకు సరిపడా నీరందక నష్టపోతున్నారు. కొల్లాపూర్ మండలం సింగోటం రిజర్వాయర్ నుంచి వీపనగండ్ల మండలం గోపాల్‌దిన్నె రిజర్వార్‌కు ప్రత్యేక కాల్వను ఏర్పాటు చేయాలని గత ఏడేండ్లుగా ప్రజల నుంచి ఒత్తిడి ఉంది. దీనిని గమనించిన అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా కొల్లాపూర్‌లో జరిగిన ఎన్నికల బహిరంగసభలో సింగోటం-గోపాల్‌దిన్నె రిజర్వాయర్లను కలుపుతూ ప్రత్యేక కెనాల్ ఏర్పాటు చేయిస్తామని ప్రకటింపజేశారు.%అయితే, ఆ ఎన్నికల్లో జూపల్లి ఓటమి చెంది బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన అనంతరం రెండు అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. అయినా ఈ కాల్వ పనులు కార్యరూపం దాల్చలేదు. ప్రధానంగా జూరాల ఎడమ కాల్వకు చివరగా ఉన్న వీపనగండ్ల, చిన్నంబాయి మండలాలకు చెందిన భూములకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పంటలు చేతికందే దశలో సాగునీరందక తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే ఈ ప్రత్యేక కెనాల్‌ను అప్పట్లో ప్రతిపాదించారు. ఐదు మండలాల రైతులకు సాగునీటి వసతి కల్పించే ఈ కెనాల్‌కు అప్పట్లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రూ.150 కోట్లతో ప్రోసీడింగ్ తెప్పించారు.

సింగోటం-గోపాల్‌దిన్నె రిజర్వాయర్లను కలుపుతూ ఏర్పాటు చేస్తున్న కెనాల్ 22కిలోమీటర్ల పొడవుంది. సింగోటం నుంచి నర్సాయిపల్లి, బొల్లారం, కొర్లకుంట, తెల్లరాళ్లపల్లి, తూంకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల మండలాలకు చెందిన భూముల ద్వారా ఈ కెనాల్‌కు సర్వే జరిగింది. ఈ కాల్వ ఏర్పాటులో 384 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఈ ప్రకారం ఇందులో 100ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా, మరో 284 ఎకరాల్లో పట్టాదారులు ఉన్నారు. ఈ మేరకు భూసేకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పుడో పూర్తి కావాల్సిన ఈపని ఇప్పటికీ కొలిక్కి రాలేదు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ పేరుతో రెవెన్యూ, హార్టికల్చర్, మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు వచ్చి వెళ్తున్నారు. అయితే, భూ సేకరణ మాత్రం అనుకున్న స్థాయిలో ముందుకు సాగడం లేదు.

# యాసాయికుంటతండాలో తాగునీటి తండ్లాట



జడ్చర్ల టౌన్, అక్టోబరు21 (టుడే విదుర): జడ్చర్ల మండలం ఆలూర్ పంచాయతీ పరిధిలోని యాసాయికుంట తండాలో తాగునీటి కష్టాలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. 15రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కాకపోవటంతో తండావాసులు ఖాళీబిందెలతో ఆందోళనకు దిగారు. జడ్చర్ల పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న యాసాయికుంట తండాలో 70ఇండ్లు ఉండగా, దాదాపు 400 మంది జనాభా ఉన్నారు. మిషన్ భగీరథ నీటి పైపులైన్లు దెబ్బతినటంతో 15రోజులుగా యాసాయికుంట తండాకు నీటి సరఫరా నిలిచిపోయింది.%దీంతో తాగునీటి కోసం తండావాసులు తండా శివారులోని వ్యవసాయ పొలాలకెళ్లి బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నా రు. మహిళలు, చిన్నారులు తెల్లవారితే నీటి కోసం ఖాళీ బిందెలతో వ్యవసాయ పొలాల కు తరలిపోతున్నారు. తండాలో తాగునీటి క ష్టాలు ఉన్నాయని వెంటనే తాగునీటి సరఫ రా చేయాలని గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు ఎంపీడీ వో కార్యాలయ అధికారులకు విన్నవించినా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చ ర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి కష్టాలు తీర్చాలంటూ ఖాళీ బిందెలతో ఆదివారం ఆందోళన చేపట్టారు.

# నిద్రమత్తులో డ్రైవర్ల నిర్లక్ష్యం.. తొర్రూరులో వరుస ప్రమాదాలు


తొర్రూరు, అక్టోబరు21 (టుడే విదుర): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల పరిధిలో రాత్రివేళల్లో లారీల డ్రైవర్ల నిర్లక్ష్యంతో జరిగే ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్లపై ప్రమాదాలు పునరావృతమవుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. పట్టణ కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో బస్టాండ్ సమీపంలోని సిగ్నల్ వద్ద ఒక గ్రానైట్ లారీ అదుపు తప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. దీంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు కాగా, వారిని స్థానికులు ఖమ్మంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.%సమాచారం అందుకున్న తొర్రూరు తొర్రూరు సీఐ తౌటం గణేష్, ఎస్ఐలు గొల్లమూడి ఉపేందర్, శివరామకృష్ణ తమ సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్ర మత్తే కారణమా లేదా వాహనంలో సాంకేతిక లోపమా అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.%కాగా ఇటీవల మండలంలోని



ఫతేపురం గ్రామ శివారులో నిద్రమత్తులో డ్రైవర్ కోళ్ల వ్యాన్‌ను రాంగ్ డైరెక్షన్‌లో నడపడంతో కోళ్ల వ్యాను బోల్తాపడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దీంతోపాటు సోమవారం దీపావళి పండుగ రోజు కూడా తొర్రూరు పట్టణంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద మరో లారీ డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ ఆ ఘటనలో ఎవరూ గాయపడలేదు. నిద్రమత్తులో వాహనాలను నడపడం ప్రాణాలకు ముప్పు తెస్తుందని, ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద వాహనాలను నడపే డ్రైవర్లకు విశ్రాంతి సమయాలు, మానసిక అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# అర్ధరాత్రి కూల్చివేతలు.. అధికారుల తీరుపై బాధితుల ఆగ్రహం

మద్దూర్, అక్టోబరు21 (టుడే విదుర): మద్దూర్ పట్టణంలో అభివృద్ధి పనుల పేరిట ప్రధాన రహదారులను రెండు లైన్లుగా మార్చే క్రమంలో రేణివట్ల చౌరస్తా నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు రెండువైపులా 70 ఫీట్ల రహదారిని విస్తరించే పనుల్లో భాగంగా అర్ధరాత్రి అ ధికారులు ఎలాంటి సమాచారం లేకుండా జేసీబీలతో షాపుల కూల్చివేతలు ప్రారంభించారు. రేణివట్ల చౌరస్తా నుంచి ప్రభుత్వ దవాఖాన ప్రహరి వైపు 35ఫీట్లు దాటి అవతలి వైపు మిగిలిన దుకాణాలను రాత్రికి రాత్రే కూల్చి వేయడంతో బాధితు లు ఆగ్రహం



వ్యక్తం చేస్తున్నారు. 35 ఫీట్లు తొలగించినా మిగితా భాగాన్ని ఎవరికి చెప్పకుండా తొలగించడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు.%అధికారులు ముందే చెబితే కనీసం దుకాణాల్లోని సామగ్రి, మిషనరి, ఇతర వస్తువులను తీసుకెళ్లేవారనమి చెబుతున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆందోళనతో 2గంటలపాటు ట్రాఫిక్ జామైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌ను ఫోన్‌లో సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

# సినిమా



## లాటరీ కింగ్ లో చిరంజీవి.. థియేటర్లు దద్దరిల్లడమే



: ఒకప్పుడు ఇండస్ట్రీలో మల్టీస్టారర్స్ అనేవి సాధారణంగా అనిపించేవి. ఒక స్టార్ హీరో.. ఇంకో స్టార్ హీరో సినిమాలో చిన్న పాత్ర, పెద్ద పాత్ర అనేది చూడకుండా కేవలం స్నేహానికి విలువ ఇచ్చి చేసేవారు. ఇక ఇప్పుడు మల్టీస్టారర్ అంటే ఒక పెద్ద టాస్క్. ఒకరికి అంటే ఒకరికి స్క్రీన్ స్పేస్ ఎక్కువ ఉండకూడదు. ఇద్దరికీ అన్నీ సమానంగా ఉండాలి. ఇక ఒక స్టార్ హీరో సినిమాలో ఇంకో హీరో క్యామియో చేసినా కూడా అది డబ్బు కోసం అని ట్రోల్ చేస్తున్నారు. అయితే ఎన్ని జనరేషన్స్ మారినా టాలీవుడ్ స్టార్ హీరోల స్నేహాన్ని మాత్రం అలాగే కొనసాగుతుంది. వారే మెగాస్టార్ చిరంజీవి, కింగ్ నాగార్జున, విక్టరీ వెంకటేష్. ఈ వయస్సులో కూడా వరుస సినిమాలు.. హిట్స్ అందుకుంటూ కుర్ర హీరోలకు సైతం షాక్ ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ముగ్గురు హీరోలు వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అంతేకాకుండా ఒకరి సినిమాలో ఒకరు క్యామియోల్లో నటిస్తూ తమ స్నేహాన్ని నిరూపించుకుంటున్నారు. అసలు విషయం ఏంటంటే.. అక్కినేని నాగార్జున ప్రస్తుతం తన వందవ సినిమాపై ఫోకస్ చేస్తున్న విషయం తెల్సిందే. రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ మధ్యనే పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఇక ఈ చిత్రంలో అనుష్క, టబు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు టాక్ నడుస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ చిత్రానికి లాటరీ కింగ్ అనే టైటిల్ ను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. నాగ్ వందవ చిత్రం కావడంతో అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. నాగ్ కూడా తన వందవ సినిమా అభిమనులందరూ గుర్తుండిపోయేలా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. అందులో భాగంగానే అనుష్కను, టబును తీసుకున్నట్లు సమాచారం.

## పెళ్లి కూడా కాలేదు.. అప్పుడే తోడికోడలిని సైడ్ చేసిన అల్లు అర్జున్ భార్య

దీపావళీ పండగను దేశమంతా ఎంతో ఘనంగా జరుపుకున్న విషయం తెల్సిందే. బంధుమిత్రులతో.. అన్ని కుటుంబాలు కళకళలాడుతూ తమ జీవితాల్లో ఉన్న చీకటిని తొలగిస్తూ దీపాలను వెలిగించి కొత్త వెలుగును నింపుకున్నారు. ప్రజలు మాత్రమే కాకుండా సెలబ్రిటీలు సైతం తమ కుటుంబాలతో ఈ దీపాల పండగను ఎంతో ఘనంగా జరుపుకున్నారు. గత రెండు రోజుల నుంచి దీవాళీ ఫొటోస్ తో సోషల్ మీడియా కన్నుల విందుగా ఉంది.

ఇక ఈసారి దీపావళీ పండగ అల్లు వారి కుటుంబానికి చాలా స్పెషల్ అని చెప్పొచ్చు. ఈ మధ్యనే అల్లు రామలింగయ్య భార్య అల్లు కనకరత్నం మరణించిన విషయం తెల్సిందే. ఆ బాధ నుంచి తేరుకోవడానికి అల్లు అరవింద్.. తన రెండో కొడుకు అల్లు శిరీష్ కు వివాహం జరిపించే పనిలో పడ్డాడు. నైనికా అనే అమ్మాయితో శిరీష్ పెళ్లి జరగబోతుందని అధికారికంగా ప్రకటించారు. శిరీష్ సైతం తన పెళ్లి తేదీ త్వరలోనే చెప్తాను అని తనకు కాబోయే భార్యతో ఉన్న ఫోటోలను షేర్ కూడా చేశాడు. శిరీష్ పెళ్లి ఫిక్స్ అయిన తరువాత వచ్చిన మొదటి దీపావళీ కావడంతో.. అల్లు ఇంట చిన్న కోడలిగా నైనికా కూడా ఈ పండగ సెలబ్రేషన్స్ లో పాలు పంచుకుంది. నైనికా రాకతో అల్లు కుటుంబం సంపూర్ణం అయ్యింది. అల్లు అరవింద్.. ముగ్గురు కొడుకులు.. ముగ్గురు కోడళ్ళ.. మనవళ్లు, మనవరాళ్ల ఆటపాటలతో, అల్లరితో కళకళలాడిపోయింది. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా కూడా మారాయి. ఇక ఇవే ఫోటోలను అల్లు స్నేహ కూడా తన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. అయితే.. ఫ్యామిలీ ఫొటోలో తోడికోడలు ఫోటోను మాత్రం సైడ్ చేసింది. నైనికా ముఖాన్ని క్రాప్ చేసి కేవలం శిరీష్ ఉన్నంతవరకే ఆ ఫొటోలో కనిపించేలా చూపించింది. 2025 దీవాళీ అని క్యాప్షన్ ఇచ్చింది. స్నేహ పోస్ట్ చేయకముందే ఆ ఫ్యామిలీ ఫోటోలు నైనికా ఫొటోతో సహా పీఆర్ ల ద్వారా బయటకు వచ్చాయి. కానీ, స్నేహ మాత్రం తోడికోడలు ఫోటో క్రాప్ చేయడంతో నెటిజన్స్ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. పెళ్లి కూడా కాలేదు అప్పుడే తోడికోడలిని సైడ్ చేసేసింది అని, ఇప్పుడే ఇలా ఉంటే పెళ్లి తరువాత ఎలా ఉంటుంది అని చెప్పుకొస్తున్నారు. ఇంకొంతమంది ట్రోల్ అవ్వకుండా పెద్ద కోడలు ముందు జాగ్రత్త తీసుకుందని చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.




## హాస్యనటుడు, దర్శకుడు అస్రాని మృతి



ప్రముఖ బాలీవుడ్, గుజరాతీ నటుడు గోవర్ధన్ అస్రానీ (84) అక్టోబర్ 20వ తేదీ అనారోగ్యంతో హాస్పిటల్ కన్నుమూశారు. జైపూర్ లో సింధీ కుటుంబానికి చెందిన అస్రానీ తండ్రి చేస్తున్న కార్పెట్ వ్యాపారం చేయడం ఇష్టంలేక సినిమాల్లోకి వచ్చారు. పూణె ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ లో నటనలో శిక్షణ తీసుకుని ఆ తర్వాత గుజరాతీ, హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టారు. దాదాపు ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఆయన మూడు వందలకు పైగా చిత్రాలలో నటించారు. ఆరు చిత్రాలకు దర్శకత్వం వహించారు. కొన్ని చిత్రాలలో హీరోగానూ యాక్ట్ చేశారు. తన సహ నటి మంజు బన్సాల్ ను ఆయన ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వివాహానంతరం కూడా వీరిద్దరూ కలిసి పలు చిత్రాలలో నటించారు. 1975లో విడుదలైన 'షోలే' సినిమాలో జైలర్ పాత్రను చేసి రక్తికట్టించారు అస్రాని. 'హమ్ ఆంగ్రేజోన్ కే జమానే కే జైలర్ హై' అంటూ ఆయన చెప్పిన డైలాగ్ అప్పట్లో అందరి నోట్లలో నానింది. తెలుగు దర్శకులు తాతినేని రామారావు , దాసరి నారాయణరావు, కె. రాఘవేంద్రరావు తెరకెక్కించిన పలు హిందీ చిత్రాలలో అస్రానీ, కాదర్ ఖాన్, శక్తికపూర్ ముగ్గురూ కలిసి నటించి ఉత్తరాది ప్రేక్షకులను మెప్పించారు.

కెరీర్ ప్రారంభంలో హృషికేష్ ముఖర్జీ ఆ తర్వాత ప్రియదర్శన్ అస్రానిని బాగా ప్రోత్సహించారు. ఒక్క రాజేశ్ ఖన్నా తోనే దాదాపు పాతిక చిత్రాలలో స్నేహితుడిగా నటించారు అస్రాని. 1970, 80లలో రెండు వందలకు పైగా చిత్రాలలో వినోదాన్ని పంచే పాత్రలను పోషించి, బాలీవుడ్ లో తనదైన ముద్రను వేశారు. పూణే ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ లో శిక్షణ తీసుకున్న ఆయన 1988 నుండి 1993 వరకూ అదే సంస్థకు డైరెక్టర్ గా సేవలు అందించారు.

## పెళ్లయిన డైరెక్టర్ తో ప్రేమ.. అవసరమా ఈషా




ఇండస్ట్రీ అన్నాకా రూమర్స్ అనేవి కామన్. హీరో హీరోయిన్ సినిమాలో కాకుండా బయట కనిపిస్తే వారిమధ్య ఏదో ఉందని చెప్పుకొచ్చేస్తారు. పెళ్ళైన హీరోతో హీరోయిన్ కనిపిస్తే.. ఆ హీరో తన భార్యకు విడాకులు ఇచ్చి ఈమెతో డేటింగ్ చేస్తున్నారు అంటారు. విడాకులు అయిన హీరోతో హీరోయిన్ కనిపిస్తే.. రెండో పెళ్లికి హీరో రెడీ అని చెప్పుకొస్తారు. అయితే ఇక్కడ ప్రతిదీ హీరోయిన్ మీదనే వస్తుంది. తాజాగా ఇలాంటి రూమర్స్ నే ఎదుర్కొంటుంది అచ్చ తెలుగందం ఈషా రెబ్బా. ఈషా రెబ్బ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందం, అభినయం ఉన్నా కూడా అవకాశాలు లేక, సక్సెస్ రాక చాలా స్ట్రగుల్స్ లో ఉంది. ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ అని ఎదురుచూస్తూనే ఉంది. ప్రస్తుతం ఈ చిన్నది ఓం శాంతి శాంతి శాంతి అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. మలయాళంలో సూపర్ హిట్ అయిన జయ జయ జయ జయహే సినిమాకు రీమేక్ గా ఈ సినిమా తెరకెక్కింది. ఇక ఓం శాంతి శాంతి శాంతి సినిమాలో డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్నాడు. ఏఆర్ సంజీవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సినిమా విషయం పక్కన పెడితే ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుంచి తరుణ్ – ఈషా ప్రేమలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.


## షాకింగ్.. ఎన్టీఆర్– నీల్ మధ్య విభేదాలు ..



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటిస్తున్న తాజా చిత్రం డ్రాగన్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ నీల్ అని తాత్కాలికంగా టైటిల్ పెట్టినా కూడా డ్రాగన్ అనే టైటిల్ ను ఫ్యాన్స్ కన్ఫర్మ్ చేసేశారు. ఎప్పుడెప్పుడు ఈ చిత్రం నుంచి ఒక చిన్న అప్డేట్ అయినా వస్తుందా అని అభిమానులు ప్రతి పండగకు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ ఉంటారు. డ్రాగన్ సినిమా కోసం ఎన్టీఆర్ ఎంతో కష్టపడ్డాడు. బాడీ మొత్తాన్ని మార్చేశాడు. బరువు తగ్గాడు.. లుక్ మార్చాడు. ప్రశాంత్ నీల్ సైతం ఎన్టీఆర్ కోసం మంచి కథనే సిద్ధం చేశాడు.



# క్రీడావార్తలు




## 4 బంతుల్లో 4 వికెట్లు.. సెమీస్ ఆశలు ఆవిరి!




మహిళల వన్డే ప్రపంచకప్ 2025 లో శ్రీలంక అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఓడిపోతుందని అంతా భావించిన మ్యాచ్ లో అనూహ్య మార్పులతో సంచలన విజయాన్ని అందుకుంది. సోమవారం బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో శ్రీలంక ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగా.. బంగ్లాదేశ్ రేసు నుంచి తప్పుకుంది. కెప్టెన్ ఆటపట్టు నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీయడంతో ఓడిపోయే మ్యాచ్‌లో శ్రీలంక గెలిచింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 48.4 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. హసిని పెరెరా(85) హాఫ్ సెంచరీతో రాణించగా.. కెప్టెన్ చమరి ఆటపట్టు( 46) కీలక ఇన్నింగ్స్ ఆడింది. బంగ్లాదేశ్ బౌలర్లలో షోర్నా అక్తెర్ మూడు వికెట్లు తీయగా.. రబెయా ఖాన్ రెండు, నహిదా అక్తెర్, నిషితా అక్తెర్, మరుఫా అక్తెర్ తలో వికెట్ తీశారు. అనంతరం బంగ్లాదేశ్(నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 195 పరుగులే చేసి ఓటమిపాలైంది. షర్మిన్ అక్తర్(64 నాటౌట్), నిగర్ సుల్తానా(77) హాఫ్ సెంచరీలతో సత్తా చాటినా బంగ్లా ఓటమిని ఆపలేకపోయారు. శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు నాలుగు వికెట్లతో రాణించగా.. సుగందిక కుమారి రెండు వికెట్లు పడగొట్టింది. బంగ్లా విజయానికి ఆఖరి 6 బంతుల్లో 9 పరుగులు అవసరం కాగా.. క్రీజులో హాఫ్ సెంచరీ చేసి ఫామ్ లో ఉన్న నిగర్ సుల్తానా ఉంది. దీంతో బంగ్లాదేశ్ విజయం లాంఛనమేనని అంతా అనుకున్నారు. కానీ శ్రీలంక కెప్టెన్ ఆటపట్టుసంచలన బౌలింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. వరుసగా 4 బంతుల్లో 4 వికెట్లు తీసి బంగ్లా పతనాన్ని శాసించింది. రబేయా ఖాన్(1), నహిదా అక్తెర్(0), నిగర్ సుల్తాన(77), మురుఫా అక్తెర్(0) వరుసగా ఔటయ్యారు. ఇందులో నహిదా అక్తెర్ రనౌట్ కాగా.. రబేయా ఖాన్, మరుఫా అక్తెర్ ఎల్బీగా వెనుదిరిగారు. నిగర్ సుల్తాన క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరింది. దీంతో బంగ్లా ఊహించని పరాభవాన్ని చవిచూసింది. ఈ టోర్నీలో(%ఔశీఎవఅ%'%ం ఔశీతీశ్రీం జబజూ% 2025) శ్రీలంకకు ఇదే తొలి గెలుపు. ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లు ఆడిన శ్రీలంక ఒక విజయం, రెండు మ్యాచుల రద్దుతో 4 పాయింట్స్ సాధించి 6వ స్థానంలో కొనసాగుతోంది. పాకిస్థాన్‌తో జరిగే ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించి.. భారత్, న్యూజిలాండ్ తమ తదుపరి రెండు మ్యాచ్‌ల్లో ఓడితే శ్రీలంక సెమీస్ చేరుతుంది. 6 మ్యాచ్‌ల్లో 5 పరాజయాలతో బంగ్లాదేశ్ అధికారికంగా సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది.

## ఆసియా కప్ ట్రోఫీని ఇవ్వకపోతే..
## ఏసీసీ చీఫ్ నఖ్వీకి బీసీసీఐ వార్నింగ్



ఇంటర్నెట్ డెస్క్: భారత్‌కు చెందాల్సిన ఆసియా కప్ ట్రోఫీని దుబాయ్ ఏసీసీ కార్యాలయంలో లాక్ చేసి పెట్టిన పాక్ మంత్రి, ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చీఫ్ మోసిన్ నఖ్వీకి బీసీసీఐ తాజాగా వార్నింగ్ ఇచ్చింది. ట్రోఫీని తిరిగివ్వని పక్షంలో ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు నఖ్వీకి ఈమెయిల్ చేసింది. మోసిన్ ప్రత్యుత్తరం కోసం ఎదురు చూస్తున్నామని బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా జాతీయ మీడియాకు తెలిపారు. ఈ విషయంలో ఓ క్రమపద్ధతిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు ఆసియా కప్ టోర్నీలో పాక్‌పై భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, మ్యాచ్ అనంతరం పాక్ మంత్రి, ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు టీమిండియా నిరాకరించింది. దీంతో, ఉక్కురోషం పట్టలేక నఖ్వీ ఆ ట్రోఫీతో పాటు ఇతర మెడల్స్‌ను వెనక్కు తీసుకెళ్లిపోవాలని ఏసీసీ అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో వాటిని దాచిపెట్టాలని, తన అనుమతి లేకుండా ఎవ్వరికీ ఇవ్వొద్దని గట్టిగా చెప్పారు టోర్నీ ముగిసి ఇన్ని రోజులు గడుస్తున్నా ట్రోఫీ చేతికందకపోవడంతో బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 30న జరిగిన ఏసీసీ సమావేశంలో నఖ్వీ తీరుపై తీవ్ర అభ్యంతరం చేసింది. విజేతగా నిలిచిన టీమిండియాకు చెందిన ట్రోఫీని వెంటనే ఏసీసీకి అప్పగించాలని నఖ్వీని డిమాండ్ చేసింది. పాక్ సీనియర్ మంత్రి నుంచి ట్రోఫీని స్వీకరించబోమని అంతకుముందే బీసీసీఐ సెక్రెటరీ తేల్చి చెప్పారు. అంతమాత్రానికే ట్రోఫీ, మెడల్స్‌ను తీసుకెళ్లే హక్కు ఆయనకు ఉండదని అన్నారు ఈ పరిస్థితుల్లో నఖ్వీ ఏసీసీ బోర్డు సభ్యులకు క్షమాపణలు చెప్పినా తన చర్యలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ట్రోఫీ కావాలనుకుంటే టీమిండియా కెప్టెన్ దుబాయ్‌కు వచ్చి తీసుకెళ్లాలని కొత్త మెలిక పెట్టారు. దీన్ని బీసీసీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. దుబాయ్‌కు మళ్లీ వెళ్లి ట్రోఫీ తెచ్చుకునేందుకు సహేతుకమైన కారణం ఏదీ లేదని స్పష్టం చేసింది. మ్యాచ్ ముగిసిన వెంటనే అప్పగించాల్సిన ట్రోఫీని ఇవ్వకుండా మళ్లీ దుబాయ్‌కు వచ్చి తీసుకెళ్లాలని చెప్పడం అర్థరహితమని స్పష్టం చేసింది.

## గిల్ కెప్టెన్సీ బాలేదు..
## టీమిండియా మాజీ క్రికెటర్ సంచలన కామెంట్స్




ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘోరంగా ఓడిన సంగతి తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 136 స్వల్ప పరుగులు చేసింది. ఈ స్కోర్‌ను ఆసీస్ సునాయాసంగా ఛేదించింది. దీంతో టీమిండియా కెప్టెన్ గా ఉన్న శుభ్‌మన్ గిల్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా గిల్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ విమర్శలు గుప్పించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అతని కెప్టెన్సీ బాలేదని, తీవ్రంగా నిరాశపర్చిందని అన్నాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పెర్త్ లో జరిగిన వన్డే మ్యాచ్ గురించి మహమ్మద్ కైఫ్(%వీశీష్ణుఎఎఝ ఝఱట%)మాట్లాడాడు. పార్ట్‌టైమ్ బౌలర్లతో విజయాలు సాధించలేమని, వికెట్ టేకింగ్ బౌలర్ అయిన కుల్దీప్ యాదవ్(%ఖబశ్రీఏవవజూఖఝఱజ%)ను తుది జట్టులో ఆడించాలని సూచించాడు. ఆస్ట్రేలియా పర్యటన భారత బౌలర్లతో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సామర్థ్యానికి కూడా పరీక్షలేనని కైఫ్ అన్నాడు. తుది జట్టులో కుల్దీప్ యాదవ్‌కు చోటు కల్పించలేదని, వికెట్ టేకింగ్ బౌలర్‌ను జట్టులోకి తీసుకోలేదని తెలిపాడు. కుల్దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం నిరాశకు గురి చేసిందని అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆసీస్ స్పిన్నర్ మాథ్యూ కుహ్నెమన్ కూడా రెండు వికెట్లు తీశాడని గుర్తు చేశాడు. ఇంకా కైఫ్ మాట్లాడుతూ..'ప్రస్తుతం జట్టులో చాలా మంది పార్ట్ టైమ్ బౌలర్లు ఉన్నారు. నితీష్ కుమార్ రెడ్డి పూర్తి స్థాయి బౌలర్ కాదు. పెర్త్ పిచ్ పై వాషింగ్టన్ సుందర్ కూడా పూర్తి స్థాయి బౌలర్ కాదు. ఫుల్ టైమ్ బౌలర్‌గా హర్షిత్ రాణా నిరాశపర్చాడు. స్వల్ప లక్ష్యమే అయినా మ్యాచ్‌ను గెలిపించే బాధ్యతను బౌలర్లు తీసుకోవాలి. కేవలం బుమ్రా, షమీ ఉన్నప్పుడే గెలుస్తామంటే ఎలా?' కైఫ్ ప్రశ్నించాడు. ఆసీస్ స్పిన్నర్ షేన్ వార్న్ మూడు ఫార్మాట్లలో సత్తా చాటాడనే విషయాన్ని కైఫ్ గుర్తు చేశాడు. ఆసీస్ వికెట్లు స్పిన్‌కు అనుకూలంగా ఉండవని చెప్పడం సరికాదన్నాదని కైఫ్ అన్నాడు.

## నా వల్లే ఈ ఓటమి..
## స్మృతి మంధాన కీలక కామెంట్స్




ఉమెన్స్ వన్డే ప్రపంచ కప్ 2025 టోర్నీలో భారత్ ఓటముల పరంపర కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో గెలిచిన భారత్.. ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్ ల్లో పరాజయం పాలైంది. ఆదివారం ఇంగ్లాండ్ తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్ లో ఇండియా 4 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈజీగా గెలవాల్సిన మ్యాచ్‌ను ఒత్తిడిని తట్టుకోలేక చేజేతులా చేజార్చుకుంది. గెలుపు ముంగిట చెత్త షాట్లతో భారీ మూల్యం చెల్లించుకుంది. ఇక భారత్ ఓటమిపై వైస్ కెప్టెన్ స్మృతి మంధానస్పందించారు. తమ జట్టు పరాజయానికి తనదే పూర్తి బాధ్యత ఆమె తెలిపింది. తన వల్లే గెలిచే మ్యాచ్‌లో ఓటమిపాలయ్యామని, తన షాట్ ఎంపిక ఇంకాస్త మెరుగ్గా ఉండాల్సిందని అభిప్రాయపడింది. ఇంగ్లాండ్ తో జరిగిన మ్యాచ్ లో ఓటమి పాలవ్వడంతో స్మృతి కన్నీరు పెట్టుకుంది. తదుపరి మ్యాచ్‌లో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతానని తెలిపింది. ఈ మ్యాచ్‌లో చాలా బలంగా కనిపించిన తమ బ్యాటింగ్..అనూహ్యంగా ఒక్కసారిగా కూలిపోయిందని ఆమె వెల్లడించింది. విజయ సమీకరణం బంతికి ఒక పరుగు ఉన్నా కూడా తాము చెత్త షాట్స్‌తో మూల్యం చెల్లించుకున్నామని విచారం వ్యక్తం చేసింది. తమ జట్టు పతనం తనతోనే మొదలైందని, కాబట్టి ఈ ఓటమికి తనదే పూర్తి బాధ్యతని స్మృతి చెప్పుకొచ్చింది. తన షాట్ సెలెక్షన్ కాస్త తెలివిగా ఉండాల్సిందని, గెలుస్తున్న సమయంలో చెత్తా షాట్స్ ఆడకుండా మ్యాచ్‌ను మరింత డీప్ తీసుకెళ్లాల్సిందని స్మృతి అభిప్రాయ పడింది. ఇంకా స్మృతి మాట్లాడుతూ...'తదుపరి మ్యాచ్ గురించి ఇప్పుడే మాట్లాడాల్సిన పనిలేదు. కానీ సెమీఫైనల్ చేరాలంటే తదుపరి మ్యాచ్ కచ్చితంగా గెలవాలి. ఈ మ్యాచ్ మాకు క్వార్టర్ ఫైనల్ లాంటిది. తదుపరి మ్యాచ్ లో విజయం సాధించేందుకు కృషి చేస్తాము. ఈ ఓటమిని మేం ఓ గుణ పాఠంగా తీసుకుంటాం.'అని స్మృతి మంధాన చెప్పుకొచ్చింది. భారత్ కుతదుపరి మ్యాచ్ లు న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో జరగనున్నాయి. ఇండియా సెమీస్ కు చేరాలంటే ఈ రెండు మ్యాచుల్లో తప్పనిసరిగా గెలవాలి.

## అడిలైడ్‌లో రోహిత్, కోహ్లీకి ఘన స్వాగతం..
## మాజీ కెప్టెన్ ఫన్నీ వీడియో చూడండి..




దాదాపు ఏడు నెలల విరామం తర్వాత టీమిండియా దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి మైదానంలోకి అడుగుపెట్టారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో పాల్గొంటున్నారు. అయితే పెర్త్‌లో జరిగిన తొలి వన్డేలో ఇద్దరూ దారుణంగా విఫలమయ్యారు. దీంతో వీరిపై విమర్శలు వెల్లువెత్తాయి. అడిలైడ్‌లో రెండో వన్డే జరగబోతోంది గురువారం అడిలైడ్‌లో జరగబోయే రెండో వన్డేలో గెలిస్తేనే గిల్ సేన సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉంచుకోగలదు. ఈ నేపథ్యంలో టీమిండియా క్రికెటర్లు ప్రాక్టీస్ కోసం అడిలైడ్ చేరుకున్నారు . వీరికి అభిమానులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా కోహ్లీ, రోహిత్‌లను చుట్టుముట్టారు. విమానాశ్రయంలో వీరితో ఫొటోలు, వీడియోలు కోసం ఎగబడ్డారు. అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు, ఫొటోగ్రాఫ్‌లు ఇస్తూ రోహిత్, కోహ్లీ బస్సు వరకు వెళ్లారు. రోహిత్ బస్సు ఎక్కి కూర్చున్న తర్వాత కూడా అభిమానులు, జర్నలిస్ట్‌లు అతడిని ఫొటోలు, వీడియోలు తీస్తూనే ఉన్నారు (%=శీష్టబ్ ఖీబఅఅం జఱఎవశీ%). దీంతో రోహిత్ వారి వైపు చేయి చూపిస్తూ బస్సు ఎక్కి లోపలికి వచ్చేయండి అని నవ్వుతూ సైగలు చేశాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, ఆడిలైడ్‌లో గత రెండు వన్డేల్లోనూ ఆస్ట్రేలియాను భారత్ ఓడించింది. ఈసారి కూడా అదే ఫలితం రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## మరోసారి తుస్సుమన్న బాబర్!



పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజమ్‌కు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. ఇప్పటికే అనేక సార్లు విఫలమైన బాబర్..దీపావళి పండగ వేళ మరోసారి తుస్సుమన్నాడు. రావల్పిండి వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగులకే పెవిలియన్ చేరాడు. బాబర్ అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ చేసి రెండేళ్లైపోయింది. చివరగా 2023లో పసికూన నేపాల్ పై శతకం చేశాడు. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా విఫలమవుతూ వస్తున్నాడు. బాబర్ వరుస వైఫల్యాలు చూసి సొంత అభిమానులే విసుగెత్తిపోయారు. 2023 ఆగస్ట్ 30న పసికూన నేపాల్‌పై వన్డే సెంచరీ చేసిన తర్వాత నుంచి బాబర్ 73 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లు ఆడాడు. అయితే వీటిల్లో ఒక్కసారి కూడా మూడంకెల మార్కును బాబర్ తాకలేకపోయాడు. మధ్యలో అడపాదడపా హాఫ్ సెంచరీలు మాత్రమే చేశాడు. ఇలా వరుస వైఫల్యాల నేపథ్యంలో ఆల్ ఫార్మాట్ కెప్టెన్సీని కోల్పోయిన బాబర్.. ప్రస్తుతం జట్టులో స్థానాన్ని కూడా డేంజర్ లో పెట్టుకున్నాడు. ఇక ఆశ్చర్యం ఏమిటంటే.. రెండేళ్లకు పైగా ఫామ్ కోల్పోయిన బాబర్‌ను పాక్ ఫ్యాన్స్ ఓ దశలో దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ)తో పోల్చారు. వరుసగా బాబర్ విఫలమవుతున్నా.. కొందరు పాకిస్థానీలు అతడు.. విరాట్ కంటే మెరుగైన బ్యాటర్ అని సిగ్గులేకుండా చెప్పుకుంటుంటున్నారు. ఇదిలా ఉంటే, రెండు టెస్ట్‌లు, మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ల కోసం సౌతాఫ్రికా జట్టు పాక్‌లో పర్యటిస్తుంది.

# బిజినెస్



## స్వల్పంగా తగ్గింది.. మీ నగరంలో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 21న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 30, 680కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 19, 790కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 30, 830కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 19, 940కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 30, 680కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 19, 790కి చేరింది వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే స్థిరంగా ఉన్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## అంతర్జాతీయ పరిణామాలే కీలకం




దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశం ఉంది. ఇప్పటికే కార్పొరేట్ ఫలితాల సీజన్ మొదలైంది. జీఎస్టీ తగ్గటం, కొనుగోళ్లు పెరగటంతో కంపెనీల మార్జిన్లు పెరిగే అవకాశం ఉంది. అయితే జియో పొలిటికల్ పరిణామాలపై ఓ కన్నేయటం మంచి ది. ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే ట్రేడింగ్ చేయాలి. నిఫ్టీ 25,700 ఎగువన నిలదొక్కుకుంటే మూమెంటమ్ మరింత బలపడుతుంది. ప్రస్తుతం ఆటో, మెటల్స్, డిఫెన్స్, టెలికాం, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి.పిడిలైట్: రెండేళు ్లగా ఎలాంటి రిటర్న్ ఇవ్వని ఈ షేరు ప్రస్తుతం పుంజుకుంటోంది. ఫిబ్రవరి నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శుక్రవారం రూ.1,542 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,520 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,660 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,490 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.ఐటీసీ: ప్రస్తుతం ఈ షేరు కనిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. జీఎసటీ సంస్కరణల నేపథ్యంలో లాభదాయకత పెరిగే అవకాశం ఉ ండటంతో ఇన్వెస్టర్లు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. గత శుక్రవారం రూ.412 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.410 శ్రేణిలో ప్రవేశించి రూ.470 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.395 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.బెర్జర్ పెయింట్స్: కొన్ని నెలల పతనం తర్వాత పుంజుకున్న ఈ షేరు ప్రస్తుతం దిద్దుబాటు దశలో ఉంది. స్వల్పకాలిక మూమెంటమ్ బలపడుతోంది. పండగల నేపథ్యంలో లాభదాయకత పెరగవచ్చు. గత శుక్రవారం రూ.544 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.525 స్థాయిలో ప్రవేశించి రూ.650 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.505 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.మహీంద్రా ఫైనాన్స్: రెండేళ్లుగా రేంజ్ బౌండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం అప్‌ట్రెండ్‌లోకి అడుగుపెట్టింది. మూమెంటమ్, డెలివరీ పెరిగాయి. బుల్లిషనెస్ కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.300 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.280 పై స్థాయిలో ప్రవేశించి రూ.355 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.260 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

మారికో: గడిచిన ఏడాది కాలంలో 10 శాతం రిటర్న్ ఇచ్చిన ఈ కౌంటర్‌లో మూమెంటమ్ బలపడుతోంది. ఈ షేరు మరింత పెరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.735 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.725పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.840 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.705 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

## నిలిచిపోయిన వెబ్‌సైట్లు, యాప్స్..ఎందుకంటే..

వాషింగ్టన్: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (%సాబెూ%) సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ సేవలపై ఆధారపడిన వెబ్‌సైట్లు, యాప్ సేవలు నిలిచిపోయాయి. ఆ జాబితాలో స్నాప్ చాట్, జూమ్, డ్యులింగో, కాన్వా, సిగ్నల్, వర్డ్‌లీ పోకేమాన్ గో వంటి యాప్స్, గేమ్స్ ఉన్నాయి. అలాగే బ్యాంకింగ్ సేవల్లో సైతం అంతరాయం ఏర్పడింది. దాంతో సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.సోమవారం మధ్యాహ్నం నుంచి అమెజాన్ వెబ్ సర్వీసుల్లో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో అమెరికాలోని తూర్పు ప్రాంతం నుంచి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయి. యాప్ విభాగం నుంచి అత్యధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. సాంకేతికంగా ఏర్పడిన ఈ అంతరాయంపై అమెజాన్ ఇంజినీర్ల బృందం పని చేస్తోంది. సాంకేతిక సేవల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా.. అమెజాన్‌కు చెందిన సేవలూ నిలిచిపోయాయి.ఏడబ్ల్యూఎస్ అంటే.. అమెజాన్ వెబ్ సర్వీసెస్. ఇది ప్రముఖ ఇ - కామర్స్ సంస్థ. అమెజాన్‌కు చెందిన అతిపెద్ద క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫారమ్. వెబ్‌సైట్లు,




యాప్‌లతోపాటు తమ సర్వర్, స్టోరేజ్, డేటాబేస్ వంటి సేవల కోసం దీనిపై ఆధారపడుతున్నాయి. 2006లో అమెజాన్ ఈ సేవలను ప్రారంభించింది. ప్రపంచంలోనే అతిపెద్ద క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్‌గా ఇది ఉంది

## పసిడి వెండిపై జరజాగ్రత్త




న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు రేసు గుర్రాల్లా పరుగెడుతున్నాయి. ధరలపరంగా రోజుకో రికార్డు సృష్టిస్తున్నాయి. గత ఏడాది ధనత్రయోదశి నుంచి ఈ ఏడాది ధనత్రయోదశి మధ్య 10 గ్రాములు మేలిమి (24 క్యారట్లు) పసిడి ధర రూ.81,400 నుంచి రూ.1,34,800కు చేరి మదుపరులకు 62 నుంచి 65 శాతం లాభాలు పంచింది. వెండి ?ధరా నేనేమీ తక్కువ కాదంటూ 69 నుంచి 70 శాతం వరకు పెరిగింది. దీంతో చాలా మంది ముఖ్యంగా మహిళలు, అయ్యో చౌకగా ఉన్నపుడు వీటిని కొనలేక పోయామే అని బాధపడుతున్నారు. పెట్టుబడి లాభాల కోసం చూసే మదుపరులదీ ఇదే బాధ. గత ఏడాది ఇదే కాలంలో స్టాక్ మార్కెట్ అత్తెసరు లాభాలతో సరిపెట్టగా బంగారం, వెండి మాత్రం మదుపరులకు గతంలో ఎన్నడూ లేని విధంగా బంపర్ లాభాలు పంచాయి.ఈ ఏడాది ఇప్పటి వరకు చూసినా బంగారం, వెండి మదుపరులకు 50 శాతం పైనే లాభాలు పంచాయి. ఇంకా పెరుగుతాయా? తగ్గుతాయా? అంటే ఎవరూ కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అయితే ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరిన బులియన్ మార్కెట్ త్వరలోనే దిద్దుబాటుకు లోనయ్యే పరిస్థితి ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ప్రాథమిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోయినా.. లాభాల స్వీకరణ అమ్మకాలు ఇందుకు దోహదం చేస్తాయని భావిస్తున్నారు. ఈ దిద్దుబాటు కూడా 5 శాతం నుంచి 7 శాతం మించకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ట్రంప్ బెదిరింపులు ఫలించి రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి బ్రేక్ పడినా ఈ దిద్దుబాటు 10 నుంచి 15 శాతానికి మించకపోవచ్చని భావిస్తున్నారు.బంగారం, వెండి ధరలు ఎంతగా పెరిగినా.. పెట్టుబడుల్లో అవి ఒక పరిమితి స్థాయికి మించి ఉండకూడదు. మదుపరులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం పసిడి ధరల పెరుగుదలకు ఎలాంటి ఫండమెంటల్స్ లేవు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటి నుంచే ఇది పెరగటం ప్రారంభమైంది. మొత్తం పెట్టుబడుల్లో బంగారం, వెండి వాటా 10 శాతానికి మించకుండా చూసుకోవటం మంచిది.

## సూచీలకు దివాళీ జోష్.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, దేశీయంగా పండగ వాతావరణం, త్రైమాసిక ఫలితాలపై ఆశాజనకంగా ఉండడం దేశీయ సూచీల్లో జోష్ నింపాయి. సోమవారం దేశీయ సూచీలు భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. దాదాపు అన్ని రంగాలు లాభాల్లోనే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా హెవీ వెయిట్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను పరుగులు పెట్టిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతన్నాయి. గత శుక్రవారం ముగింపు (83, 952)తో పోల్చుకుంటే సోమవారం ఉ దయం 300 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. ఒక దశలో 700 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 472 పాయింట్ల లాభంతో 84, 424 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 138 పాయింట్ల లాభంతో 25, 848 వద్ద కొనసాగుతోంది%సెన్సెక్స్‌లో ఆర్బీఎల్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్, రిలయన్స్, పాలీక్యాబ్ మొదలైన షేర్లు లాభాల్లో ఉ న్నాయి . జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, హిందుస్థాన్ జింక్, ఐసీఐసీఐ బ్యాంక్,




దాల్మియా భారత్, డిక్సన్ టెక్నాలజీస్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 348 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 308 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.83గా ఉంది.

## మీషో రూ 4250 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: మరో ఈ-కామర్స్ సంస్థ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ప్రైమరీ మార్కెట్ ద్వారా రూ.4,250 కోట్లు సమీకరించేందుకు ఈ-కామర్స్ సంస్థ మీషో సెబీకి దరఖాస్తు చేసింది. ఈ ఐపీఓ ద్వారా ప్రారంభంలో కంపెనీలో పెట్టుబడి పెట్టిన పీఈ సంస్థలు కూడా తమ వాటాలో కొన్ని షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ ద్వారా సేకరించే ని?ధుల్లో కొంత మొత్తాన్ని వ్యాపార విస్తరణ కోసం ఉపయోగించాలని మీషో భావిస్తోంది.




TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006